మఠాలకు గ్రాంట్లు ఇవ్వండి

- హిందూ, దళిత అర్చకుల శిక్షణ ఇచ్చే గురుకులాల ఏర్పాటుకు సహకరించాలి
- ముఖ్యమంత్రికి స్వామీజీల వినతి

7



సిద్ధంగా ఉన్న విత్తన గింజలు (క్వింటాళ్లలో..)

పంట	డిమాండ్	లభ్యత
వేరుశనగ	70,000	1,11,177
వరి	70,000	79,910
రాగి	23,000	31,288
సజ్జ	2,700	5,700
జొన్న	1,000	1,480
తృణధాన్యాలు	250	1,435
కంది	33,800	40,741
పెసలు	8,100	8,136
ఉద్దులు	3,000	4,020
అలసంద	3,000	3,962
సూర్యకాంతి	3,800	9284
సోయా	1,80,500	2,00,000
అనప	200	200
హైబ్రీడ్‌జొన్న	64,000	1,01,151
ఆముదం	10	10

ముందస్తు సాగు..!

- జోరు వర్షాలతో సాగు పనుల్లో అన్నదాతలు
- రెండు నెలల్లో 56 శాతం అధిక వర్షం
- సెప్టెంబరు దాకా దిగులు లేదంటున్న అధికారులు
- డిమాండ్‌కు తగ్గట్టుగా విత్తనగింజలు సిద్ధం

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగుకు నైరుతి రుతుపవనాలు కీలకమవుతాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు మే నెలాఖరు నుంచి జూన్ మూడో వారం లోగా ప్రవేశిస్తాయి. అండమాన్ మీదుగా కేరళలోకి ప్రవేశించి రాష్ట్రంలోని దక్షిణకన్నడ జిల్లా మీదుగా రాష్ట్రమంతటా విస్తరించి ఆంధ్రప్రదేశ్, దక్షిణాదిరాష్ట్రాలవైపు నైరుతి రుతుపవనాలు పయనిస్తాయి. దశాబ్దాలకాలంగా నైరుతి రుతుపవనాల ఆధారంగానే దక్షిణాది రాష్ట్రాల్లో ఖరీఫ్ పంటకాలం ప్రారంభం అవుతుంది. 2023లో వర్షాభావంతో ఖరీఫ్, రబీ రెండు సీజన్‌ల్లోనూ పంటలు సాగు కాలేదు. పైగా రాష్ట్రంలోని కీలకమైన ప్రాంతాలకు తాగునీటి సమకూర్చే కావేరి నది అనుబంధ ప్రాజెక్టులు వెలవెలబోయాయి. దాహార్తికి బెంగళూరు సహా వేలాది గ్రామాల ప్రజలు తల్లడిల్లారు. 2024లో నైరుతి రుతుపవనాలు సకాలంలోనే ప్రారంభం కావడం, పుష్కలమైన వర్షాలు కురిశాయి. ఏడాది మొత్తంగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండడమే కాక చెరువులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడాయి. ఇటీవల రెండు నెలల వ్యవధిలోనే చెరువుల్లో నీరు ఇంకిపోగా, ప్రాజెక్టుల్లో నీటిమట్టం తగ్గింది. అంతలోనే మార్చినుంచే వర్షాలు రాష్ట్రమంటా ప్రారంభమయ్యాయి.

వేసవిలోనే వర్షాలు..

నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యాక కురిసే వర్షాలతో నేల తడవగానే నాగలిపట్టి అన్నదాతలు దుక్కులు చేసుకుంటారు. ఇలా నెలరోజులకుపైగా భూములు చదును చేసుకోవడం, దుక్కులు దున్నడం ముగించి జూన్ మొదటివారం నుంచి విత్తనపనులు కొనసాగిస్తారు. అయితే ఈ ఏడాది మార్చినుంచే వర్షాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నెలాఖరునాటికి దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదయ్యాయి. ఏదైనా వర్షం కురవడంతో దుక్కులు చేసుకునేందుకు అనువుగా మారింది. ఓవైపు ఎండలు మండిస్తున్నా మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో నాగలి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. కాడెద్దులతో దు న్నడం కంటే ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్‌లు, ట్రిల్లర్‌లు వంటి యంత్రాలు రాత్రింబవళ్లు తేడాలేకుండా పనులు సాగిస్తున్నాయి. ఎండాకాలంలో దున్నడం ద్వారా భూమిలో ఉండే పురుగులు నశించడంతో పాటు నేలలోనూ మార్పులు సాధ్యం కానున్నాయి. అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

సెప్టెంబరు దాకా వర్షాలే..

నైరుతికి ముందే వర్షాలు ప్రారంభం కావడం, సెప్టెంబరు దాకా ఆశాజనకంగా వరుణుడి కరుణ ఉంటుందనే సంకేతాలతో సాగు విస్తీర్ణం పెంచుకునేందుకు వ్యవసాయశాఖ ముందస్తుగా కసరత్తు చేస్తోంది. నైరుతికి ముందు 82.50 లక్షల హెక్టార్లు, నైరుతి రుతుపవనాల వేళ ఖరీఫ్‌లో 25.50 లక్షల హెక్టార్లు, రబీలో 114.40 లక్షల హెక్టార్లలో విత్తనాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ మొదటివారం నుంచే చామరాజనగర, మండ్య, హాసన్, చిక్కమగళూరు, తుమకూరు, కొప్పళ, రామనగర, మైసూరు, చిత్రదుర్గ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూమి చదును చేసుకోవడం, దుక్కులు చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది.

పెసలు, అలసంద, ఉద్దులు, నువ్వులు, సూర్యకాంతి, పత్తి, పొగాకు వంటి పంటల విత్తన పనులు ప్రారంభమయ్యాయి. తీరప్రాంత జిల్లాలు మలెనాడు, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఏప్రిల్ రెండోవారం నుంచే సాగుపనులు కొనసాగుతున్నాయి. నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో జూన్ మొదటివారం దాకా వేచి ఉండకుండా విత్తనపనులు కొనసాగించేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు.

> **సరాసరి దాటేసింది..**
>
> ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచి మే నెల 2వరకు 45.2 మిమీ వర్షం కురవాల్సి ఉండేది. సరాసరి 70.7 మిమీ వర్షం కురిసింది. దీనిప్రకారం 52శాతం అత్యధిక వర్షం నమోదయ్యింది. మరో నాలుగు నెలలు వర్షాలు జోరువానలు ఉంటాయనే వాతావరణ శాఖ సూచిస్తోంది. 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు దాకా 26.77 లక్షల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు అవసరం కానున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ చేశారు. వ్యవసాయశాఖ ద్వారా 10.87 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు గోడౌన్లలో నిల్వ ఉన్నాయి.

హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి హత్య కేసులో
8 మంది అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న మంగళూరు నగర పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మంగళూరులో హిందూ కార్యకర్త సుహాస్‌శెట్టి హత్యకేసులో 8మందిని అరెస్టు చేసినట్లు మంగళూరు నగర పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుహాస్‌శెట్టి హత్యకేసులో ప్రధాన నిందితుడు సఫ్వాన్‌ను అరెస్టు చేశామన్నారు. మంగళూరు నగరం శాంతిగుడ్డ బజ్పె గ్రామానికి చెందిన డ్రైవర్ అబ్దుల్ సఫ్వాన్ (29), ఇదే గ్రామానికి చెందిన నియాజ్ (25), మహ్మద్ ఉసామిర్ (32), కలందర్ షాఫి (29), ఆదిల్ మెహ్రూప్ (27), నాగరాజ్ (20), మహ్మద్ రిజ్వాన్ (28), చిక్కమగళూరు రుద్రపాద నివాసి డ్రైవర్ రంజిత్‌లు ఉన్నారన్నారు. 2023లో ఓ సంఘటన హత్యకు కారణంగా తెలుస్తోందన్నారు. సఫ్వాన్, ప్రశాంత్‌శెట్టి మధ్య గొడవ జరిగిందన్నారు. ప్రశాంత్‌శెట్టి హత్యకు గురైన సుహాస్‌శెట్టికి ఆప్తమిత్రుడని, గొడవ తర్వాత రాజీ విషయమై 2023 సెప్టెంబరులో చర్చలకు పిలిచి ప్రశాంత్, అతడి అనుచరులు డ్రాగర్‌తో దాడి చేశారు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్సలు పొంది కోలుకున్నారు. ప్రశాంత్‌పై దాడికి సఫ్వాన్ పలుమార్లు ప్రయత్నించారన్నారు. ప్రశాంత్‌శెట్టికి అండగా ఉన్నారనే కారణంతోనే సుహాస్‌శెట్టిపై కక్ష పెంచుకున్నారన్నారు.

కారుతో ఢీ కొట్టి.. మారణాయుధాలతో దాడి చేసి..

ఇదే అవకాశంగా తీసుకుని రెండేళ్లక్రితం హత్యకు గురైన ఫాజిల్ తమ్ముడు ఆదిల్ వ్యూహాత్మకంగా వ్యవహరించాడు. ఈ బృందానికి రూ.5 లక్షల రూపాయలు సాయం చేశాడని కమిషనర్ తెలిపారు. సఫ్వాన్ కొంతమంది క్రిమినల్స్‌తో కలసి మినీ కంటైనర్ డ్రైవర్ చేస్తూ సుహాస్ కారుకు ఢీ కొట్టారన్నారు. అంతలోనే ముజమిల్ డ్రైవింగ్ చేస్తూ వచ్చిన స్విఫ్ట్‌కారులో మిగిలిన వారు వచ్చారన్నారు. ఒక్కసారిగా మారణాయుధాలతో చుట్టుముట్టి దాడి చేసి హతమార్చారన్నారు. ముజమిల్ 4 నెలలక్రిందటే సౌదీ అరేబియా నుంచి వెనుదిరిగి వచ్చాడని ఇటీవలే పెళ్లి చేసుకున్నాడన్నారు. ఖలందర్ షాఫి బెంగళూరులో సేల్స్‌మెన్‌గా పనిచేసేవాడని, ఇతడిపై సూరత్కల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. మహ్మద్ రిజ్వాన్ సౌదీ అరేబియాలో ఆయిల్‌ప్లాంట్‌లో పనిచేసేవారని, మంగళూరులోని జోకట్టి ప్రాంతంలో నివసిస్తారన్నారు. రంజిత్ చిక్కమగళూరు జిల్లా కలస తాలూకా రుద్రపాద గ్రామానికి చెందినవారు కాగా డ్రైవర్‌గా ఉంటున్నాడన్నారు. ఇతడే లాంగ్‌ను తీసుకొచ్చాడన్నారు. చిక్కమగళూరు జిల్లా కలస తాలూకా మావినకెరెకు చెందిన నాగరాజ్ ఓ సప్తయర్స్ దుకాణంలో పనిచేస్తాడన్నారు.

మత ఘర్షణల నివారణకు టాస్క్‌ఫోర్స్: హోంమంత్రి



తీరప్రాంత జిల్లాల్లో దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో మత ఘర్షణల నియంత్రణకు ప్రత్యేకటాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. శనివారం మంగళూరులో పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేకసభ జరిపారు. సుహాస్ హత్యతోపాటు అంతకు ముందు అష్రఫ్ హత్యకు సంబంధించిన సంఘటనలను ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నక్సల్స్ నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన తీరులోనే దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో మతఘర్షణల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయదలిచినట్లు తెలిపారు. సుహాస్ హత్యలో 7మంది, అష్రఫ్ హత్యలో 28మంది అరెస్టు అయ్యారన్నారు.

ఆటోను ఢీ కొన్న బస్సు.. ముగ్గురి దుర్మరణం

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హొరనాడుకు వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు నెలమంగల సమీపంలోని జాతీయ రహదారి 75పై రోడ్డు క్రాస్ చేస్తున్న ఆటోను ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాస (40), పుట్టమ్మ (50), వర్షిణి (13) మృతి చెందారు. లేఖనా, నాగరత్నమ్మ, వెంకటేశ్ గాయపడ్డారు. శాంతినగర్ నుంచి నెలమంగలకు వెళ్తున్న ఆటోలో డ్రైవర్ సహా ఆరుగురు ఉన్నారు. పుట్టమ్మ, శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా వర్షిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆటో రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా బస్సు దూసుకురావడమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. బస్సులో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



ఘటనాస్థలంలో గుమిగూడిన ప్రజలు

మృత్యుకుంట..!

- నీటికుంటలో పడి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా ఇంగళి గ్రామంలోని నీటికుంటలో ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు. ముగ్గురికీ ఈత రాకున్నా ఇంటినుంచి సైకిల్‌పై సుదూరం ఉన్న వ్యవసాయ కుంట వద్దకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం కుంటలో ఈత కొట్టేందుకు ప్రయత్నించి మృతి చెందారు. పృథ్విరాజ్ హెరబ (13), అధర్వ సౌందళగి (15), సమర్థ గడకేరి (13)లు మృతి చెందనవారు. పొలం రైతు కుంట సమీపంలో సైకిల్ ఉండడాన్ని గుర్తించి అనుమానంతో పరిశీలించగా ముగ్గురు చిన్నారులు మృతి చెందినట్లు తెలిసింది. పోలీసుల సహాయంతో స్థానికులు మృతదేహాలను వెలికి తీశారు.



విద్యార్థులు (ఫైల్)

కృష్ణా ట్రిబ్యునల్ గెజిట్ జారీ చేయాల్సిందే..

- ఢిల్లీ సమావేశంలో అదే డిమాండ్
- ఆల్మట్టి డ్యామ్ ఎత్తు 524కి పెంచుతాం: సీఎం

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కేంద్రజలశక్తి మంత్రి ఈనెల 7న బుధవారం కృష్ణా నదీ పరీవాహక రాష్ట్రాల ప్రత్యేక సభకు ఆహ్వానించారని, కృష్ణా ట్రిబ్యునల్ నిర్ణయాలపై వెంటనే గెజిట్ జారీ చేయాలని డిమాండ్ చేయనున్నట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్‌తోపాటు రాష్ట్ర జలవనరుల నిపుణులతో సీఎం శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుదీర్ఘ చర్చల అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. కృష్ణ జల వివాదాలపై 2010 డిసెంబరు 30న ట్రిబ్యునల్ 2 తీర్పును ప్రకటించిందన్నారు. 2013లో గెజిట్ జారీ చేసిందన్నారు. అప్పటి నుంచి కేంద్రప్రభుత్వం ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిశామన్నారు. అందుకు అనుగుణంగానే ప్రత్యేక సభకు ఆహ్వానించారన్నారు. రెండో ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం 173 టీఎంసీల నీటిని ఉపయోగించుకునేలా సూచించిందన్నారు. కృష్ణజలాలకు అనుబంధమైన బాగల్కోటె జిల్లాలోని ఆల్మట్టి డ్యామ్‌ను 519 మీటర్ల నుంచి 524కు పెంచడం ద్వారానే కర్ణాటకకు కేటాయించిన నీటిని వినియోగించుకోవడం సాధ్యమవుతుందన్నారు. అందుకోసం ప్రత్యేకంగా గెజిట్‌ను జారీ చేయాలన్నారు. సభలోనూ ఇదే ప్రతిపాదనపై డిమాండ్ చేస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూడా దరఖాస్తు చేసుకున్నాయన్నారు. వారు వారికి కేటాయించిన నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయని కారణంగా ఆల్మట్టి ప్రాజెక్టును 524 మీటర్లకు పెంచే పనులను చేపడతామన్నారు.



కృష్ణా నదీ జలాల సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

వేలాది మంది భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం



వైభవంగా మరళుసిద్దేశ్వరుడి మహా రథోత్సవం



మరల సిద్దేశ్వరస్వామి

కంప్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లాలోని కొట్టూరు తాలుకా ఉజ్జయిని సద్ధర్మ పీఠం మరళు సిద్దేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం లక్షలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం సాగింది. తెల్లవారుజాము నుంచే అర్చకుల బృందం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మరళు సిద్దేశ్వర స్వామికి పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథం ఊరేగించారు. కొట్టూరు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



నగరంలో ఐపీఎల్ సందడి

క్రికెట్ అభిమానులు సందడి చేశారు. వారాంతం కావడంతో యువతీయువకులు భారీగా తరలివచ్చారు. నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) జట్ల మధ్య మ్యాచ్ సాగింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.29	1,577.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	746	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	282	120
నీటి నిల్వ (టీఎంసీలు)	6.87	3.57



రోడ్డుపై తిరుగుతున్న ఎలుగుబంటి

వీధుల్లో ఎలుగుబంటి సంచారం

బళ్లారి సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు రోడ్డు ఏపీఎంసీ వెంకటేశ్వర ఆలయం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఎలుగబంటి సంచారంతో స్థానికులు ఆందోళన చెందారు. రోడ్డుపై తిరుగుతున్న ఎలుగుబంటి దృశ్యాన్ని కొందరు తమ మొబైల్ ఫోన్లలో బంధించారు. ఎలుగుబంటి కోర్టు గుండా ఏపీఎంసీ ప్రభుత్వ పాఠశాల వైపు పరుగెత్తింది. ప్రజలు ఆటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆటవీ శాఖ సిబ్బంది వచ్చి ఎలుగుబంటిని అడివిలోకి తరిమి కొట్టారు. ఎగులుబంటి ఆహారం కోసం పట్టణానికి వచ్చి ఉండవచ్చు రోడ్డుపై పడిన మామిడి పండ్ల వాసన దృష్టిని ఆకర్షించి ఉండవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల భద్రతకోసం ఆటవీ శాఖ సిబ్బందిని పట్టణంలో భద్రత కోసం మోహరించాలని ఆదేశించామని, సండూర్ జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ దాదా కలందర్ అన్నారు.

కల్యాణ కర్ణాటకలో
సంవిధాన బచావో ర్యాలీలు

ఏఐసీసీ కార్యదర్శి గోపీనాథ ఫళనియప్ప

బళ్లారి, మే 3(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక జిల్లాలైన రాయచూరు, కొప్పళ, విజయనగర, బీదర్, కలబురగి, యాదగిరి, బళ్లారిలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకూ సంవిధాన్ బచావో.. మెహింగాకో హఠావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అలిండియా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గోపీనాథ పళినయప్ప ప్రకటనలో తెలిపారు. 3న రాయచూరులో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో డీసీసీ కమిటీతో సమావేశం నిర్వహిస్తామని, అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. వచ్చే రోజుల్లో కాంగ్రెస్‌కు మంచి రోజులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు విసిగెత్తి పోయారన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం ఖాయమన్నారు.

పురాణ పఠనం ప్రారంభం

బళ్లారిరూరల్, మే 03 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గొల్లరెడ్డి గణేష్ దేవస్థానంలో ఐదు రోజులపాటు జరగనున్న బ్రహ్మంగారి చరిత్ర పురాణ ప్రవచనం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలో మహిళా భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పద్మ ఆచారి, వేదావతి, వీరేష్, గణేష్, చంద్రమౌళి ఆలయ సభ్యులు, భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో పింఛన్ అందజేత

గుత్తి, మే 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని 12వ వార్డుకు చెందిన సుశీలమ్మ అనే పింఛన్ లబ్ధిదారురాలు బెంగళూరులో ఆసుపత్రిలో ఉండగా.. సచివాలయ ఉద్యోగి రఫీ శనివారం అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశారు. రెండునెలలుగా ఆమె ఆనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో అప్పటి నుంచి ఆమె ఫించన్ తీసుకోలేదు.

రాబడికే ప్రాధాన్యం..!

● సెలవుల్లోనూ వదలని ప్రైవేట్ పాఠశాలలు ● పదో తరగతికి ప్రత్యేక తరగతులు ● ఒత్తిడితో తలలు పట్టుకుంటున్న విద్యార్థులు



బళ్లారి, మే 3(ఆంధ్రజ్యోతి): సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తూ ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పదవతరగతి, పబ్లిక్ పరీక్షల పేరుతో సెలవుల్లో ఆటపాటలకు దూరమయ్యేలా చేస్తున్నాయి. ఫీజులు, ర్యాంకులే ధ్యేయంగా ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న దందాపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి. విజయనగర జిల్లాలో కొన్ని ప్రైవేటు స్కూళ్లు 2025-26 విద్యాఏడాదికి అప్పుడే పదోతరగది క్లాసులు ప్రారంభించారు. ఏడాది పాటు చదువు కుంటూ మరో తరగతికి ప్రమోషన్ పై వెళ్తున్న వేళ కనీసం కాస్త ఉపశమనం కూడా లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. వాస్తవానికి వేసవి సెలవులను మే 29 వరకూ ప్రభుత్వం ప్రకటించింది. బళ్లారి జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు 489 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు 1260 ఉన్నాయి. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు. అసలే ఎండలు మండిపోతన్నాయి..ఇలాంటి వేళ విద్యార్థులు బయట తిరిగితే ఆనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని కొందరు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం సెలవుల్లో తరగతులు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. పాఠశాల యాజమాన్యం అధికారులను బేఖాతరు చేయడంపై ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే విద్యార్థులు పాఠశాలలు మారకుండా, ఫీజులు కట్టించుకుని యాజమాన్యమే ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని కొందరు విమర్శిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు కోరుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఆగడాలు అరికట్టాల్సి ఉందని పేర్కొంటున్నారు.

వేసక్టమీతో ఎటువంటి ఇబ్బందులుండవ్

● అపోహలు వీడి ఆపరేషన్‌కు ముందుకు రావాలి: డీహెచ్‌ఓ



డీహెచ్‌ఓ రమేష్ బాబు

బళ్లారి సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): పురుషులు సులభమైన జనన నియంత్రణ పద్ధతి అయిన ఎన్ఎస్‌వీ(నో స్కాల్పెల్ వేసక్టమీ) చేయించుకోవచ్చని, తద్వారా సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. సండూర్ తాలూకాలోని తోరణగల్లు గ్రామానికి చెందిన దంపతులను అభినందిస్తూ ఆయన మాట్లాడారు. జిల్లాసుపత్రిలో సరళమైన, కుట్టలేని,మచ్చలేని 'నో స్కాల్పెల్ వేసక్టమీ' (ఎన్ఎస్‌వీ) శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సమాజంలో ఒక జంట పిల్లలు పుట్టకూడదని నిర్ణయించుకున్నప్పుడు గర్భాశయానికి మాత్రమే లాప్రోస్కోపిక్ లేదా ట్యూబెక్టమీ శస్త్రచికిత్స చేయించుకోవడం ఆచారం. దంపతుల్లో తమ భార్యకు మాత్రమే శస్త్రచికిత్స చేయిస్తుంటారు, కానీ చాలా సులభమైన వేసెక్టమీ శస్త్రచికిత్సతో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో భాగమైన స్టెరిలైజేషన్ సర్జరీలో భర్త పాల్గొనేలా చేసి ఎన్ఎస్‌వీ సర్జరీ గురించి విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సిబ్బందికి సూచించారు. జిల్లా కుటుంబ సంక్షేమ కార్యక్రమ అమలు అధికారిణి డాక్టర్ పూర్ణిమ కట్టిమనె మాట్లాడుతూ ఎన్ఎస్‌వీ శస్త్రచికిత్స అనేది సాధారణంగా శస్త్రచికిత్స లేని ప్రక్రియ. దీనివల్ల మచ్చలు ఏర్పడవు అనే విషయంపై జిల్లాలో అవగాహన కల్పిస్తున్నామని, ఇది పురుషుల వంధ్యత్వానికి కారణమవుతుందనే అపోహను తొలగించడానికి నిరంతరం అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈసందర్భంగా తోరణగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌రావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, ఆశా వర్కర్ రాజేశ్వరి, నిపుణులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ కాశీ ప్రసాద్ బృందాన్ని అభినందించారు.

కులాన్ని స్పష్టంగా నమోదు చేయాలి

● ఎస్సీ, ఎస్టీ సంచార సంస్థల జిల్లా అధ్యక్షుడు శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

బళ్లారి సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల జనాభా లెక్కల సమయంలో, సింధోల్లు, బేడ, బుడగజంగం, దక్కలిగ, హండిజోగి, సిల్లెక్యాట, దొంబారు, చన్నదాసరు, సుడుగాడు సిద్ధ కులాలవారు దరఖాస్తులను పూరించేటప్పుడు షెడ్యూల్డ్‌కులాలని స్పష్టంగా పేర్కొనాలని షెడ్యూల్డ్ కులాలు ,షెడ్యూల్డ్ తెగల సంచార సంస్థల జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఇప్పటికే ఈ విషయంలో సమాజంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కులగణనలో సమాజంలోని ప్రజలను షెడ్యూల్డ్ కులాలుగా జాబితా చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాలకు అంతర్గత రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. షెడ్యూల్డ్ కులాలన ఉపవర్గీక రించి ఒకదానితో ఒకటి కలపవచ్చన్నారు. షెడ్యూల్డ్ కులాలలో అంతర్గత రిజర్వేషన్లపై నివేదిక సమర్పించడానికి రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్‌దాస్ అధ్యక్షతన ఏక సభ్య కమిషన్ ఏర్పడింది. కమిషన్ సిఫార్సుల ఆధారంగా అంతర్గత రిజర్వేషన్లపై సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సర్వే మే 5నుండి ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల కోసం కుల గణన నిర్వహించడానికి ప్రభుత్వం సాహసోపేతమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో ఉభయ సంఘాల ఆఫీస్ బేరర్లు, ఎస్సీఎస్టీ రంగయ్య, సుబ్బన్న, రామాంజిని,హంచ్చప్ప, హనుమంతప్ప, గాదిలింగ, హులుగప్ప, అజప్ప, చన్నబసప్ప. వెంకటేశ్, శైలాసీతారాం, కందప్ప, సంచార వర్గాల నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో హనుమంతుడు

సిరుగుప్ప, మే 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన పేటే ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణలోని దేశనూరు రోడ్డుమార్గంలో వైశాఖ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వాముల వారికి పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకులపూజ కార్యక్రమం చేపట్టారు. భక్తులు ప్రసాద పంపిణీ చేపట్టారు.

వైభవంగా మహమ్మద్ షా ఖాద్రీ ఉరుసు



ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

సిరుగుప్ప, మే 3 (ఆంధ్రజ్యోతి): నూర్ మహమ్మద్ షా ఖాద్రీ ఉరుసు మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తాలుకాలోని తుంగభద్ర నది గట్టున వెలసిన నూర్ మహమ్మద్‌షా ఖాద్రి ఏటా నిర్వహించడం ఆనవాయితీ. గంధం, ఉరుసు, జియారత్ కార్యక్రమాలు మూడు రోజులపాటు జరగనున్నాయి. గద్దె ఖాదర్ బాషా గురువులు, సయ్యద్ మహమ్మద్ ఖాద్రీ పాల్గొని ఉరుసు మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మెల్యే గవియప్ప పుట్టినరోజు వేడుకలు



గవియప్పను అభినందిస్తున్న మహిళలు

కంప్లి, మే 3(ఆంధ్రజ్యోతి): హోస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన నివాసంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మంజులకుమార్, అనిత రాణి, ఉమ, నాగరత్నం, గంగమ్మ, వరలక్ష్మి, సురేఖ, మహిళా మోర్చా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరమార్థదేవ్‌జీ

హొసపేటలో యోగా భవన్ నిర్మించాలి

● పతంజలి సెంట్రల్ ఇన్‌చార్జి పరమార్ధదేవ్‌జీ

బళ్లారి సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యావ్యవస్థకు ప్రాధాన్యమిస్తూ, వ్యాధి రహిత భారతదేశాన్ని నిర్మించడానికి హొసపేటలో యోగా భవన్ నిర్మించాలని పతంజలి సెంట్రల్ ఇన్‌చార్జ్ పరమార్ధదేవ్‌జీ పేర్కొన్నారు. తనమూడు రోజుల పర్యటన చవరి రోజున హొస్పేట్‌లోని భూపాల ప్రహ్లాద్‌నివాసంలో శనివారం కార్యకర్తలు, మీడియాతో మాట్లాడిన ఆయన సమాజాన్ని సరైన మార్గంలో నడిపించడానికి అందరి సహకారం అవసరమన్నారు. ఇటీవల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వింతవ్యాదులు మనల్ని చుట్టుముడుతున్నాయి. ఆరోగ్యకరమైన మనసులు మాత్రమే దేశానికి శాంతి, ప్రశాంతతను తీసుకురాగలవు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి యోగా సులభమైన మార్గమన్నారు. యోగా సాధకులు అధిక సంఖ్యలోఉన్న హొసపేటలో అన్ని సౌకర్యాలతో కూడిన యోగాభవన్ అవసరమన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జ్ యోగాచార్య భవర్‌లాల్ ఆర్య మాట్లాడుతూ మంచి సామాజిక సేవ కోసం మీడియాతో సహా ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని అభ్యర్థించారు. పతంజలి యోగా కమిటీకి చెందిన భూపాల్ రాఘవేంద్ర శెట్టి, ప్రొ హళ్ళికేరి, సంజయ్ కుస్తిగార, భూపాల్ ప్రహ్లాద్, కిరణ్‌కుమార్, బాలచయంద్ర శర్మ, రాజేశ్ కర్వా, అనంతజోషి, వీరేశ్ కనకేరిమఠ్, శ్రీరామ్ తదితరులున్నారు.

యోగాతో అనారోగ్యానికి చెక్

కంప్లి : తప్పకుండా యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని డాక్టర్ పరమార్థదేవ్‌జీ తెలిపారు. శనివారం కంప్లి పతాంజలి యోగ సమితి శారద పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డుల్లోను, గ్రామాల్లోను పట్టణాల్లో యోగ శిక్షకుని తయారు చేసినట్లయితే యోగా మరింత ప్రాముఖ్యత సాధిస్తుందన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జ్ అంతర్జాతీయ యోగా గురువు భావరాలాల్ ఆర్య, కొట్రేష్, తాలుకా ఇన్‌చార్జ్ మౌనేష్, రాష్ట్ర కిసాన్ ఇన్‌చార్జ్ సంజయ్ కుష్ట కర్జీ రాష్ట్ర మహిళా ఇన్‌చార్జి గౌరమ్మ, రాష్ట్ర సభ్యురాలు బాలచంద్ర శర్మజీ, మహిళా ఇన్‌ఛార్జ్ కల్లుడి రత్న, పతంజలి కమిటీ కార్యదర్శి చిత్ర, షణ్ముఖప్ప, అనేక మంది మహిళా యోగా సాధకులు పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన బెస్ట్ విద్యార్థులు



ప్రజ్వల్ | వన్యశ్రీ | యుతిక | విష్ణుప్రసాద్ | వర్షిణీ | చందన

బళ్లారిసిటీ,మే 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో బెస్ట్‌పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రజ్వల్, జాగర్లమూడి వన్యశ్రీ 96-48శాతం మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. విష్ణుప్రసాద్, ఎస్.యుతిక 96శాతం, బోప్పన వర్షిణీ 95.68, చందన 94.56 శాతం మార్కులు సాధించి పాఠశాలకు కీర్తిని తెచ్చారు. విద్యార్థులను బెస్ట్‌స్కూల్ ఛైర్మన్ కోనంకి రామప్ప, వైస్ ఛైర్మన్ కోనంకి తిలక్, కార్యదర్శి మన్నె శ్రీనివాస్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అరుణకుమారి, సిబ్బంది వర్గం అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్‌జీటీ విద్యార్థులు



ప్రతిభ చాటిన గురుతిప్పేరుద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్

పట్టణంలోని శ్రీ గురుతిప్పేరుద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్(ఎస్.జీ.టీ) విద్యార్థులు 2024-25 పదవతరగతి పరీక్షల్లో మంచిఫలితాలు సాధించారు. మొత్తం 16మంది విద్యార్థులు డిస్టింక్షన్ , 43మంది విద్యార్థులు ప్రథమ స్థానం , 18విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. సంజన ప్రథమ స్థానంలో, నవతేజశ్విని ద్వితీయ స్థానంలో, స్నేహ తృతీయ స్థానం, అంకిత 4వస్థానం, తనుప్రియ 5వ స్థానం సాదించి స్కూల్‌కు వన్నె తెచ్చారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్‌జీటీ ఛైర్మన్ రుద్రప్ప, కార్యదర్శి నాగరాజు, డైరెక్టర్ మంజుళ, ప్రిన్సిపల్ ఇలియాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పది ఫలితాల్లో సత్తాచాటిన జ్ఞానామృత విద్యార్థులు



తనుశ్రీ | సాహిర్‌బాను | ప్రణీత | నూరి | నేహా | సాకిబ్

బళ్లారి మర్చెడ్ ట్రస్ట్ జ్ఞానామృత ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు . పరీక్షకు హాజరైన 67 మంది విద్యార్థుల్లో 11మంది విద్యార్థులు డిస్టింక్షన్, 32 విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 11మంది విద్యార్థులు ద్విదీయ స్థానంలో ఉత్తీర్ణులైయ్యారు. తనుశ్రీ 625మార్కులకు గాను 615, సాహిరా బాను 593, ప్రణీతా 591, నూరి 572, నేహా 570, మహమ్మద్ సాకిబ్ 564 మార్కులు సాధించారని మర్చెడ్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంజీ గౌడ తెలిపారు. విద్యార్థులను జ్ఞానామృత స్కూల్ ఛైర్మన్ ఎంజి.గౌడ, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

రాణించిన చేతన్ విద్యానికేతన్ విద్యార్థులు



నయన | సుధేష్ణ | ఎం కావ్య | అన్నపూర్ణ | రశ్మిత

కంప్లి, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేతన్ విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో తాలుకాలో రెండవ స్థానంలో నిలిచారు. 55 మంది విద్యార్థులకు గాను 48 మంది విద్యార్థులు 87.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. పి నయన 619 మార్కులు, సుధేష్ణ కృపతి 612, ఎం కావ్య 610, అన్నపూర్ణ కోటే ఎస్ 608, రశ్మిత 594 మార్కులు సాధించారు. డిస్టింక్షన్‌లో 12 మంది, ఫస్ట్ క్లాస్ 23, సెకెండ్ క్లాస్ 13, థర్డ్ క్లాస్ ఏడు మంది సాధించారు. పాఠశాల యాజమాన్యం శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు.

తిరుమల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



భార్గవి | భవాని | జాస్మిన్ | ఇస్రాత్ భాను | చేతన | ఆఫీఫా

బళ్లారిరూరల్: తాలుకాలోని గోడేహాళ్ తిరుమల హిరియ ప్రాథమిక ప్రౌఢశాల విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన జీ భార్గవి611 మార్కులు, ఏ భవాని 597, ఎస్ జాస్మిన్ 592, షేక్ ఇస్రాత్ బాను 590, చేతన చౌదరి 587, ఆఫీఫా తస్నుం 586 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్ఎం నాగరాజు అభినందించారు.

హోసూరు జోన్

విద్యుత్ సరఫరాలో అంతరాయం



మరమ్మతుల్లో సిబ్బంది

హోసూరు, మే 3(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంతంలో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాలలో అంతరాయం నెలకొంది. విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో ఇచ్చంగూరు, జీ మంగలం, ఉలియాలం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్‌సిబ్బంది పెను ప్రమాదం వాటిల్లకుండా వెంటనే విద్యుత్ సరఫరానే ఆపేశారు. సుదీర్ఘ ప్రయత్నాల అనంతరం విద్యుత్‌స్తంభాన్ని బాగు చేశారు. తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా భారతీదాసన్ జయంతి

హోసూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో భారతీదాసన్ జయంతిని నిర్వహించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు తమిళ వారోత్సవాలను ఏప్రిల్ 29 నుంచి మే 5వరకు నిర్వహిస్తున్నారు. తమిళ కవి, విప్లవ రచయితగా ప్రజలను చైతన్యం చేసిన ఘనత భారతీదాసన్‌కే దక్కిందని వక్తలు పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న ఈ సందర్భంగా భారతీదాసన్ కవితలలో సామాజిక ఆలోచనలు అనే శీర్షిక ద్వారా ప్రసంగించారు. విద్యార్థులకు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

దాడులు కొనసాగితే ప్రభుత్వానికి పుట్టగతులుండవ్

● సుహాస్ శెట్టి హత్య పై బీజేపీ నిరసన

రాయచూరు, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూవుల పై జరుగుతున్న దాడులు, హత్యలు ఇదే రీతిలో కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవని బీజేపీ జిల్లాధ్యక్షుడు వీరనగౌడ లక్కిహాళ్ హెచ్చరించారు. మైనార్టీలను సంతృప్తి పరిచేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ హిందూవులపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా పట్టించుకోకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. మంగళూరులో సుహాస్ శెట్టి హత్యను నిరశిస్తు శనివారం బీజేపీ నాయకులు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బీజేపీ జిల్లాధ్యక్షుడు వీరనగౌడ లక్కిహాళ్, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మైనార్టీల పట్ల ఉదాసీనత పెరిగి హిందూవులను నిర్లక్ష్యం చేయడం అలవాటుగా మారిందన్నారు. ఓట్ల కోసం ఇలాంటి నీచరాజకీయాలకు పాల్పడితే ప్రజల తిరస్కారం తప్పదని హెచ్చరించారు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణ

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దేహదారుఢ్య పోటీలు

హోసూరు, మే 3(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దేహధారుఢ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. వందలాది మంది యువత పాల్గొన్నారు. మత్తిగిరిలోని కింగ్‌మేకర్ ఫిట్‌నెస్ జిమ్‌లో కృష్ణగిరి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. 6 విభాగాలలో పోటీలు సాగాయి. 50కిలోలు, 60 కిలోలు, 75 కిలోల విభాగంలో పోటీలు నిర్వహించారు. మిస్టర్ కృష్ణగిరి, నాకౌట్ పోటీలో వందమందికిపైగా యువకులు పోటీ పడి తమ సత్తా చాటుకున్నారు. కృష్ణగిరి జిల్లా రెజ్లర్‌గా రామ్‌రాజ్ అనే యు వకుడు గెలుపొందాడు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, మంజునాథ్, జగదీశ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాసుదేవన్, రాము, హరీశ్‌రెడ్డి, గుమ్మి అలియాస్ హేమకుమార్, రాజు తదితరులకు దేహధారుఢ్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన యువతకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందచేసి అభినందించారు. పలు గ్రామాల యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నగరాభివృద్ధి అందరి బాధ్యత: కమిషనర్

రాయచూరు, మే 3(ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం ఉన్న రాయచూరు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు మరింత సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత అందరి పై ఉందని రాయచూరు మహనగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్ర అన్నారు. ఈ విషయంలో అధికారులు మరింత నిబద్ధతతో పని చేయాలని సూచించారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాలను కమిషనర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్న కమిషనర్ సంబంధిత అధికారులకు వాటి పరిష్కారం కోసం గడువు విధించారు. ఇదే సందర్భంలో స్థానికులతో మాట్లాడిన కమిషనర్ నగర స్వచ్ఛతలో ప్రజలు పూర్తిగా మహనగర పాలక సంస్థకు సహకరించాలన్నారు. విచ్చలవిడిగా వ్యర్థాలను రోడ్లపై వేయడం, మలమూత్రాలను బహిరంగంగా విసర్జించడం వంటి మానుకోవాలని సూచించారు. చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక కట్టడాలకు నిలయమైన రాయచూరు ఇతర ప్రాంతాల వారికి కనువిందు చేసేదిగా అత్యంత సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు తమని కలువవచ్చని కమిషనర్ సూచించారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జుబిన్

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

త్యాగరాజస్వామి (జయంతి)



కర్ణాటక సంగీతానికి మూల స్తంభంగా నిలిచి నాదోపాసన ద్వారా భగవంతుడిని తెలుసుకోవచ్చునని నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి 1767 మే 4న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూర్ గ్రామంలో జన్మించారు. త్యాగయ్య, త్యాగబ్రహ్మ పేర్లతో పేరొందారు. కర్ణాటక సంగీత త్రయంలో శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు సమకాలికుడు. తమిళదేశంలో పుట్టినా తెలుగు, సంస్కృతంలోనే ఎక్కువగా ఆయన గానాలున్నాయి. ప్రత్యేకించి శ్రీరాముడు, వేంకటేశ్వర స్వామిపై ఆయన రచనలు, కీర్తనలు సంగీతసాహిత్య ప్రియులను అలరించాయి. పుష్య బహుళ పంచమిని త్యాగరాజ ఆరాధనోత్సవంగా నిర్వహిస్తారు. 1847 జనవరి 6న పరమపదించారు.

దాసరి నారాయణరావు (జయంతి)



'దర్శకరత్న'గా పేరొందిన దాసరి నారాయణరావు 1947 మే 4న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ దర్శకుడు, నిర్మాత, స్క్రిప్ట్ రైటర్, డైలాగ్ రైటర్, నటుడు, సినీ గీతాల రచయిత, రాజకీయ నేతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సినీరంగంలో తనదైన చరిత్ర సృష్టించుకున్నారు. 3 జాతీయ అవార్డులు, 9 నంది అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్, రఘుపతి వెంకయ్య అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలోనూ నటించారు. 'మేఘసందేశం' సినిమా ఇండియన్ పనోరమలో ప్రదర్శించబడింది. 2017 మే 30న కన్నుమూశారు.

ఆడ్రీ హెప్‌బర్న్ (జయంతి)



ఆడ్రి హెప్‌బర్న్ 1929 మే 4న బెల్జియంలో జన్మించారు. బ్రిటీష్‌కు చెందిన నటి. అంతేకాక మానవతావాదిగా రాణించారు. సినీ రంగంలోనూ, ఫ్యాషన్ ఐకాన్‌గాను గుర్తింపు పొందారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే 'థర్డ్ గ్రేటెస్ట్ ఫిమేల్ స్క్రీన్ లెజెండ్'గా గుర్తింపు పొందారు. ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్ అవార్డ్, బాఫ్టా అవార్డ్‌లు అందుకున్న నటి. ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా తదితర ఖండాల పేదలకు తనవంతు చేయూత ఇచ్చి యూనిసెఫ్ రాయబారిగా వ్యవహరించారు. 1993 జనవరి 20న కన్నుమూశారు.

సిక్కిల్ ఆర్ భాస్కరన్ (జయంతి)



కర్ణాటక సంగీతంలో వయోలిన్ కళాకారుడిగా పేరొందిన సిక్కిల్ ఆర్ భాస్కరన్ 1936 మే 4న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లాలో జన్మించారు. కంచి కామకోటి పీఠంలో ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. చెన్నై మ్యూజిక్ అకాడమీ బంగారు పతక గ్రహీత. రేడియోలో రెండు దశాబ్దాలపాటు ఏ గ్రేడ్ కళాకారుడు. కళైమామణి, గానకళా భారతి, సంగీత కళామృత తదితర పురస్కారాలు పొందారు. 2021 జూలై 20న కన్నుమూశారు.

నగ్నంగా తిరిగిన యువతి

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఐటి సిటీ బెంగళూరులో చిత్ర విచిత్రమైన సంఘటనలు చోటు చేసుకుంటుంటాయి. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో ఒక యువతి నగ్నంగా సంచరించిన సంఘటన శనివారం ఉద యం చోటు చేసుకుంది. స్థానిక పీజీలో ఉంటున్న ఓ యువతి ఒంటిపై నూలుపోగు లేకుండా రద్దీ రోడ్డుపై సంచరించింది. సదరు యువతి ఎక్కడికో వెళ్లి నగ్నంగా పీజీకి వాపసు రావడం సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ యువతి మత్తులో వెళ్తున్నట్టు తెలుస్తోందని కొందరు స్థాని కులు అభిప్రాయపడగా మరికొందరు ఆమెకు మతిస్థిమితం లేదని అనుమానం వ్యక్తం చేశారు. స్థానికులు ఇందుకు సంబంధించి హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

స్వీపర్‌పై మూట మాయం కేసు

ఉరవకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలంలో హుండీ లెక్కింపు సమయంలో నగలు మూట మాయం వ్యవహారంలో స్వీపర్ శ్రీనివాసులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈవో రమేష్‌బాబు స్వీపర్‌పై ఫిర్యాదు చేశారని సీఐ మహానంది తెలిపారు. ఆలయంలో మార్చి 18న హుండీ సొమ్ము లెక్కింపు చేపట్టారు. ఆ సమయంలో ఓ భక్తురాలు నిలువు దోపిడీ సమర్పించి, హుండీలో వేసిన బంగారు ఆభరణాల మూటను స్వీపర్ ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్చకుడు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చిందని, నగలను కాజేయలన్న ఉద్దేశంతోనే స్వీపర్ ఇలా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి, స్వీపర్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్‌వద్ద పెనుకొండ ఎక్సైజ్ అధికారులు వా హనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో కర్ణాటక మద్యం తరలిస్తున్న నల్లమాడకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. కారుతోపాటు 18 హైవార్డ్స్ విస్కీ బాక్సులను స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం పట్టుబడిందన్నారు. ఇద్దరు వ్యక్తులతోపాటు కారును స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదుచేసి రిమాండుకు తరలించామన్నారు. ఈఈఎస్‌టీఎఫ్ ఎస్ఐ ఓం సింహ, కానిస్టేబుళ్లు మల్లికార్జున, దేవేంద్రనాయక్, భరత్ పాల్గొన్నారు.

స్టేట్ టాపర్‌కు పురసభ ఆధ్వర్యంలో పౌరసన్మానం



భావనను సత్కరిస్తున్న పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు

విజయపుర, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని నీలగిరీశ్వర పాఠశాల విద్యార్థి భావన రాష్ట్ర స్థాయి ఫస్ట్‌ర్యాంకు సాధించారు. ఈ నేపథ్యంలో పురసభ అధ్యక్షురాలు భవ్యమహేశ్, ఉపాధ్యక్షులు తాజున్నీస తదితరులు శనివారం పౌరసన్మానం చేశారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షురాలు భవ్య మహేశ్ మాట్లాడుతూ భావన సాధనతో తాలూకా కీర్తి ఇనుమడించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రగతి విద్యాసంస్థలో ఎంతవరకు చదువుతుందో అంతవరకు ఉచితంగా అవకాశం కల్పించనున్నట్టు ప్రగతి విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. పురసభ సభ్యుడు నందకుమార్ మాట్లాడుతూ విజయపుర విద్యార్థిని సాధనతో పట్టణానికి సరికొత్త రికార్డు నెలకొల్పినట్టయ్యిందన్నారు. ఈ సందర్భంగా పురసభ సభ్యులు నారాయణస్వామి, భైరేగౌడ, రవి కుమార్, శిల్పా అజిత్, కవితా ముని అంజినప్ప పాల్గొన్నారు.

ఉన్నత విద్యలోనూ రాణించండి



తాలూకా టాపర్లను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు తదితరులు

బాగేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచినవారు తమ తదుపరి ఉన్నతవిద్యలోనూ రాణించాలని బిళ్ళూరు ఆంజనేయస్వామి సేవాట్రస్టు అధ్యక్షులు నాగరాజు పేర్కొన్నారు. 2024-25 వార్షిక ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్యసాయిధర్మశాల సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చక్కటి సాధన కనబరిచారని తాలూకాకు మంచిపేరు తెచ్చారన్నారు. రానున్నరోజుల్లో పోటీల్లో పరీక్షల్లో కూడా సత్తా చాటుకోవాలని పిలుపునిచ్చారు. యంగ్ ఇండియాస్కూల్ సంస్థాపకులు డీ శివణ్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు కీలకమన్నారు. అలాగే ఉన్నత విద్యలో చక్కగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అమరనాథబాబు, పీజీ శివశంకరాచారి, కేటీ వీరాంజనేయులు, జయరాంశెట్టి, వెంకటస్వామి, మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

శిడ్లఘట్ట తాలూకాకు పేరు ప్రఖ్యాతులు

శిడ్లఘట్ట, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో 625 మార్కులకు 622 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాల్గో ర్యాంకు సాధించిన జాహ్నవి వల్ల శిడ్లఘట్ట తాలూకాకు పేరు ప్రఖ్యాతులు ఇనుమడించాయని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వాసవి పాఠశాల విద్యార్థి జాహ్నవిని ఆర్‌సీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. వాసవి విద్యాసంస్థతోపాటు ఆర్యవైశ్యమండలి పదాధికారులు, ఇతర సంఘాల సభ్యులు ఆత్మీయంగా సత్కరించారు. బెంగళూరు గ్రామీణ హోబళి అధ్య క్షులు సీకల్ ఆనందగౌడ, నగరసభ సభ్యుడు నారాయణస్వామి, ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు మహేశ్‌బాబు తదితరులు మిఠాయిలు అందచేసి శాలువాతో సన్మానం చేశారు.



జాహ్నవిని అభినందిస్తున్న ఫౌండేషన్ పదాధికారులు

టాపర్లకు ఎమ్మెల్యే అభినందన



విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రియాకృష్ణ తదితరులు

విజయనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను గోవింద రాజనగర్ ఎమ్మెల్యే ప్రియాకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. మాతా నేషనల్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు నమిత 625 మార్కులు(స్టేట్ ఫస్ట్‌ర్యాంకు), హర్షవర్ధన్ 623 (స్టేట్ మూడోర్యాంకు), నేహా 622 మార్కులు (స్టేట్ నాల్గోర్యాంకు) సాధించారు. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి ఉన్నత విద్యకోసం తలా రూ.25వేలు ప్రోత్సాహకాలు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయపతాకంతో అభిమానులు



ఆర్‌సీబీకి మద్దతుగా...



ధోనీతో రజత్ పటీదార్

నగరంలో ఐపీఎల్ సందడి

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం ఐపీఎల్ సందడి నెలకొంది. రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) జట్ల మధ్య మ్యాచ్ సాగింది. సీఎస్‌కే జట్టులో ఎంఎస్ ధోనీ ఉండగా, ఆర్‌సీబీలో విరాట్‌కొహ్లి ఉండడంతో మ్యాచ్‌ను వీక్షించేం దుకు క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాధారణం కంటే అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండడంతో నియంత్రించేందుకు అదనపు పోలీసు బలగాలను బందోబస్తుకు కేటాయించారు. టాస్ గెలిచిన ధోని బౌలింగ్‌ను ఎంచుకున్నారు. ఆట మొత్తం ఉత్కంఠగా సాగింది. పలువురు క్రీడాభిమానులు ప్లకార్డులు ప్రదర్శించి సందడి చేశారు.



స్టేడియం వద్ద చిన్నారులతో కలిసి..



స్టేడియం బయట పోలీసు బందోబస్తు

పౌరకార్మికులకు శాశ్వత నియామకపత్రాల అందజేత

బొమ్మనహళ్ళి, మే 3(ఆంధ్రజ్యోతి): నగరాన్ని స్వచ్ఛపరచడంలో కీలకమైన పౌరకార్మికులను పర్మినెంట్ చేయడం ద్వారా కాంగ్రెస్ తన హామీ నిలబెట్టుకుందన్నారు. డెయిరీ సర్కిల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి పాల్గొని పౌరకార్మికులకు పర్మనెంటూ చేస్తూ నియామకపత్రాలను అందచేశారు. శనివారం ఏర్పాటైన కార్యకమంలో మంత్రి మాట్లాడుతూ పౌరకార్మికులను పర్మనెంట్ చేయాలనే ప్రతిపాదన 1983 నుంచి ఉండేదని, చివరకు కాంగ్రెస్ పాలనలో సాధ్యమైందన్నారు. పౌరకార్మికులు 12,626 మందికి విడతలవారీగా నియామకపత్రాలు అందచేస్తున్నట్టు తెలిపారు. కాగా పర్మనెంట్ కావడంతో నిర్లక్ష్యం చేయకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇదే సందర్భంగా మంత్రిని ఘనంగా సత్కరించారు. పౌరకార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైసూరు నారాయణప్ప, జిల్లా అధ్యక్షులు ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు. ముత్యాలప్ప పోరాట ఫలితంగాను ఇది సాధ్యమైందని మంత్రి సహా పలువురు పౌరకార్మికులు అభిప్రాయపడ్డారు. డెయిరీ సర్కిల్ చుట్టుపక్కల ప్రాంతాల కార్మికులకు నియామకపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా పదాధికారులు రీనా, అశ్విని, స్వాతి, వెంకటేష్, జగదీశ్, నరసింహ, శరత్ బాబు, ప్రకాశ్, పోతులయ్య, బీటీఎం నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్, బీబీఎంపీ ఇంజనీర్లు రవికుమార్, శశికళ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి రామలింగారెడ్డి

మఠాలకు గ్రాంట్లు ఇవ్వండి

▸▸ ముఖ్యమంత్రికి స్వామిజీల వినతి

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలు, దళిత మఠాల సమాఖ్య స్వామిజీలు వెంటనే మఠాలకు గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. శనివారం కావేరి నివాసంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ఉప్పర సమాజ మఠాధిపతి పురుషోత్తమానంద స్వామిజీ నేతృత్వంలో పలువురు స్వామిజీలు, మఠాల పాలనాధికారులు కలిశారు. హిందూ, దళిత అర్చకులను రూపొందించేలా గురుకులాలను ప్రారంభించాలని కోరారు. చిత్రదుర్గ జిల్లాలో స్థలం కేటాయించాలని కోరారు. స్వామిజీల వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో యాదగిరి జిల్లా జగద్గురు రేవణ సిద్దేశ్వర గురుపీఠం ట్రస్టు అగతీర్థ స్వామిజీ, బెంగళూరు భగీరథ ధార్మిక ట్రస్టు పాలనాధికారి, రాయచూరు జిల్లా శివశక్తి పీఠం, తుమకూరు జిల్లా కాశీ అన్నపూర్ణేశ్వరి మహాసంస్థానంతోపాటు 35మఠాలకు చెందిన స్వామిజీలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎంతో వివిధ మఠాధిపతులు

నిరాధార ఆరోపణలు సరికాదు



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

బంగారపేట, మే 3(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి చెట్లను తొలగించడంతో దాన్ని అడ్డుకునేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారని అయితే సమాచారలోపంతో ప్రజలు తప్పుగా భావించారని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి స్పష్టం చేశారు. తాలూకాలోని తొప్పనహళ్ళి గ్రామపంచాయతీలో శనివారం ఏర్పాటైన గ్రామసభను ప్రారభించి మాట్లాడారు. సర్వే 11లో తళూరు గ్రామానికి చెందిన కొందరు అటవీశాఖ భూమిని ఆక్రమించి కంచె వేశారన్నారు. దీన్ని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టేలా ఫెన్సింగ్ అమర్చారన్నారు. అయితే మల్లేశనపాళ్యకు వెళ్లే మార్గాన్ని అటవీశాఖ మూసివేసిందంటూ మాజీ ఎంపీ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సరైన సమాచారం లేకుండా ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. గ్రామసభలో ప్రజల సమస్యలు ఆలకించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్కే జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

పదిలో రాణించిన విజయజ్యోతి విద్యార్థులు



ఎక్కువమార్కులు సాధించిన విద్యార్థులు

బెంగళూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): యలహంక కామాక్షమ్మలే అవుట్‌లోని విజయజ్యోతి ఇంగ్లిష్‌స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో రాణించారు. సౌమ్యశ్రీ 93 శాతం, దిలీప్ 83శాతం, స్మృతి కేఏ 81శాతం, చంద్రికా 78శాతం, సంపూర్ణ 76శాతం మార్కులు సాధించారు. 30మంది విద్యార్థులు ఉత్తమర్యాంకులు సాధించినట్టు పాఠశాల సెక్రటరీ వీఎస్ వివేక్ తెలిపారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నట్టు పేర్కొన్నారు.

నగలు, నగదు స్వాధీనం.. నిందితుల అరెస్టు



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ కుశాల్ చౌక్సి

బాగేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీ కేసులను పోలీసులు ఛేధించి సుమారు రూ.30లక్షల విలువైన నగలు, రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ కుశాల్‌చౌక్సి మీడియాతో మాట్లాడుతూ పట్టణ శివారులోని తిమాకలహళ్ళిలో 2023 ఏప్రిల్ 27న నరసింహమూర్తి, 28న సుధాకర్ ఇంటిలో చోరీలు జరిగాయని, ఈ కేసులను ఛేధించారన్నారు. నిందితులు ఉమాశంకర్ (27), జగన్నాథ (33)లను అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులను విచారణ వేళ వేర్వేరు చోట్ల చోరీ కేసులలో ప్రమేయం ఉన్నట్టు అంగీకరించారన్నారు. బాగేపల్లి, కొళ్లెగాల పోలీస్‌స్టేషన్‌లో తలా 2, బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్‌లో 1, హొన్నాళి పోలీస్‌స్టేషన్‌లో 1 కేసు ఉన్నాయన్నారు. సుమారు 28.072 లక్షల రూపాయల విలువైన 319 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.88 లక్షల విలువైన వెండి ఆభ రణాలు, నేరాలకు ఉపయోగించిన స్యాంట్రో కారును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసును ఛేధించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: దగ్గుపాటి



కార్యకర్త భార్యకు బీమా ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎ.నారాయణపురం పంచాయతీలో టీడీపీ కార్యకర్త నరసింహులు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. బైక్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని నరసింహులు రెండు నెలల క్రితం మృతి చెందారు. అంతకు రెండు నెలల క్రితం ఆయన టీడీపీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకున్నారు. పార్టీ సభ్యత్వం ఉన్నవారికి టీడీపీ బీమా చేయించిన విషయం తెలిసిందే. దీంతో నరసింహులు కుటుంబానికి బీమా అందేలా ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారు. ఇటీవల నరసింహులు భార్య బ్యాంకు ఖాతాలో బీమా సొమ్ము రూ.5 లక్షలు జమ అయింది. బీమా ధ్రువపత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కేవలం రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్నందుకు కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు బీమా వచ్చిందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కోసం మంత్రి నారా లోకేశ్ తీసుకున్న చొరవ దేశంలో ఏ నాయకుడూ తీసుకోలేదని కొనియాడారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకీ కోటి సభ్యత్వాలు లేవని, అది టీడీపీకే సాధ్యమైందని అన్నారు. అర్బన్ నియోజకవర్గంలో 70వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశామని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ, తాను అండగా ఉంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

పావగడ, మే 3(ఆంధ్రజ్యోతి): తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పాజిహళ్లి సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉప్పారుపల్లికి చెందిన ఆనంద్‌నాయక్ (50)అనే రైతు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు ఆనందనాయక్ వేరుశనగ విత్తనం కోసం రొద్దం సమీపంలోని రాసూరులో కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా విజయవాడకు చెందిన ఓ కారు అప్పాజిహళ్లి గ్రా మ సమీపం మలుపులో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. స్థానికులు అతనిని హుటాహుటిన పావగడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతు మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తిరుమణి సీఐ గిరీష్, ఎస్ఐ లక్ష్మణ్ ఘటనాస్థలానికి చేరుకుని కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు.